అభినందనలు



గచ్చిబౌలి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ రవికుమార్ యాదవ్ శనివారం కలిశారు. నగరంలోని ఆయన నివాసంలో రవికుమార్‌యాదవ్ కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

రన్నింగ్ రేసులో అన్విన్‌కు గోల్డ్‌మెడల్స్



రాయదుర్గం: పరుగుపందెంలో ముప్పిడి అన్విన్ 2 గోల్డ్‌మెడల్స్, ఒక వెండి పతకాన్ని సాధించారు. రాయదుర్గం ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు కుమారుడు ముప్పిడి అన్విన్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో హైదరాబాద్ చాంపియన్ ట్రాఫ్స్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వన్‌ఫీల్డ్ ఈవెంట్స్ చాంపియన్స్ పోటీలలో అండర్–8 విభాగం 100 మీటర్ల పరుగుపందెంలో విజయం సాధించారు. అండర్–11 కేటగిరిలో రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించారు. దీంతో ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌టీఎల్ రెడ్డి, ఫ్యాకల్టీ బృందం అభినందించారు.

పాఠశాలలో కెరీర్ ఫెయిర్



మాదాపూర్: మాదాపూర్‌లోని మెరీడియన్ స్కూల్‌లో శనివారం కెరీర్ ఫెయిర్‌ను ఏర్పాటు చేశారు. వందకు పైగా జాతీయ, అంతర్జాతీయ యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించినట్టు మెరీడియన్ స్కూల్ ప్రిన్సిపల్ కరణం భవాని తెలిపారు. నగరంలో సుమారు 500 మంది విద్యార్థులు ఫెయిర్‌లో పాల్గొని వారి సందేహాలను నివృత్తి చేసుకున్నట్టు తెలిపారు. బిజినెస్ మేనేజ్‌మెంట్, డిఫెన్స్, ఏవియేషన్, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫైన్‌ఆర్ట్స్, హోటల్ మేనేజ్‌మెంట్‌లలో కోర్సులు అందిస్తున్న కెనడా, జర్మనీ, అమెరికా దేశాలకు చెందిన యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాలల ఎండి బుట్టా రేణుక, సీఈవో తేజస్విని, బుట్టా పాఠశాల ప్రెసిడెంట్ లలితానాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



అల్లూరి సీతారామరాజు కాలనీలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్: డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. డివిజన్ పరిధిలోని అల్లూరి సీతారామరాజునగర్ కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను త్వరితగతిన పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాలనీవాసులు సుధాకర్ రెడ్డి, రామకృష్ణవర్మ, బలరాం, రాము, మహేశ్వర్ రెడ్డి, దుర్గారాజు, శ్రీను ఉన్నారు.

సీసీ రోడ్లకు నిధులు



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి హనుమాన్ నగర్‌లో సీసీ రోడ్డు వేయాలంటూ కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శనివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, జీహెచ్‌యంసి అధికారులతో కలిసి హనుమాన్‌నగర్‌లో పర్యటించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, నిర్మాణ పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, పోశెట్టి గౌడ్, ఇద్దయ్య, లక్ష్మణ్, సందీప్ ,హరిశంకర్, నిరంజన్, రమేష్, శ్రీను, ఏఐ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు పడకుండా ప్లాస్టిక్ ట్రేలు పెట్టిన దృశ్యం



వానొస్తే .. డబ్బాలు పెట్టాల్సిందే..

శిథిలావస్థలో ఆబ్కారీ అద్దె భవనం

- తడుస్తున్న ఫైళ్లు.. సిబ్బందికి తప్పని జాగారం
- స్టేషన్‌లోకి వర్షపు నీరు



చందానగర్ హుడా కాలనీలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్

చందానగర్: సుమారు రూ.100 కోట్ల ఆదాయం వచ్చే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు కనీసం సొంత భవనం లేదు. శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు భూకేటాయింపు చేసినా నూతన భవనం నిర్మాణం ప్రారంభించలేదు. కాగా రాష్ట్ర ప్రభుత్వానికి అధికంగా ఆదాయం తెచ్చిపెట్టేది అబ్కారి శాఖ. తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గం శేరిలింగంపల్లిలోని ఎక్సైజ్ స్టేషన్ ఇరుకు అద్దె భవనంలో కొనసాగుతోంది. ఏళ్ల తరబడి అద్దె భవనంలో ఎక్సైజ్ స్టేషన్ ఉండడం, ఆ భవనం శిథిలావస్థకు చేరింది. 2023 సంవత్సరంలో గోపన్‌పల్లి గ్రామం సర్వే నెంబర్ 37లో 600 గజాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

- శేరిలింగంపల్లి, కొండాపూర్ రెండు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో మొత్తం వైన్స్‌లు 39, బార్‌లు 102 ఉన్నాయి.
- ప్రస్తుతానికి రెండు స్టేషన్లలో ఒక ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక హెడ్‌కానిస్టేబుల్, 9 మంది కానిస్టేబుళ్లకు ఇద్దరు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- అద్దె భవనం ఇరుకుగా ఉండడం వలన సీజ్ చేసిన వాహనాలు పార్కింగ్ చేయడానికి స్థలం లేదు.
- ఎక్సైజ్ స్టేషన్ భవనం శిథాలావస్థకు చేరి వర్షపు నీరు గదుల్లోకి చేరుతున్నాయి.

త్వరలో మరో అద్దె భవనంలోకి..



శేరిలింగంపల్లి మండలం ఎక్సైజ్ స్టేషన్‌కు గోపన్‌పల్లిలో 600 గజాల స్థలాన్ని కేటాయించారు. నూతన భవన నిర్మాణం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్తా. అప్పటి వరకు వేరే భవనంలోకి స్టేషన్‌ను మారుస్తాం.

– లక్ష్మణ్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, శేరిలింగంపల్లి మండలం



స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు

- భారీ వర్షం పడితే స్టేషన్‌లోని వస్తువులు, ఫైళ్ళు తడిసిపోతున్నాయి.
- వర్షాకాలం పోలీస్ సిబ్బంది రాత్రి పూట జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.
- భవనంలో ఖాళీ స్థలం లేక స్టేషన్‌కు వచ్చే వారు రోడ్డుపైనే పార్క్ చేస్తున్నారు.



వర్షాలకు ఉరుస్తున్న స్లాబ్

అలరించిన కథక్.. కూచిపూడి నృత్య ప్రదర్శనలు

మాదాపూర్: కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం ఫ్యూజన్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్, డ్యాన్స్ విద్యార్థులు హిందుస్థానీ గాత్రం, కథక్, భరతనాట్య ప్రదర్శనలతో అలరించారు. హిందుస్థానీ రాగ్‌దుర్గ, రాగ్‌భైరవి రాగాలను దృశ్య, ఈసాన్వి, ఆరుషి, దియా, దర్శిని ఆలపించారు. కథక్ నృత్యప్రదర్శనలో దుర్గస్తుతి, హోలి, తరణతీన్తాల్, అంశాలను చవి, శ్రియ, షీలా, ఖుషి,తనిష్క, బియాంకా తదితరులు ప్రదర్శించారు. భరతనాట్య ప్రదర్శనలో శ్లోకాంజలి, సరస్వతి పుష్పాంజలి, పదం, తిల్లాన అంశాలను సాక్షి, ఆద్య, వైభవి, మీరా, ఆకాంక్ష, సహస్ర తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా నృత్యాంజలి డ్యాన్స్ అకాడమీ గురువు రజనీమాయి చకిలం శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. గణేశవందన, అదిగో అల్లదిగో, జయజనార్దన, దశావతారం, గరుడగమన, రామరామ సంకీర్తనలను నృత్య రూపం ఇచ్చారు. కళాకారులు ప్రియఅనుజ్ఞ, దేవరాజ్ త్విష నిధిప, జస్వికరెడ్డి, వేదశ్రీ సంయుక్త, కార్తీక, అఖిల ప్రసన్న, సిరిసరయు, జీవిక, మనస్విని, ట్విస, మిషి, మైర, నిమిష, తన్వి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారులను సంస్థ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



శిల్పారామంలో..



వర్షాకాలం జాగ్రత్తలు పాటించాలి

హెచ్‌సీయూ హెల్త్ సెంటర్ సీఎంఓ డా.రవీంద్రకుమార్

గచ్చిబౌలి: వర్షాకాలం వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని హెచ్‌సీయూ హెల్త్ సెంటర్ సీఎంఓ డాక్టర్ రవీంద్రకుమార్ సూచించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, వాటి నివారణచర్యలపై ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాన్ని శేరిలింగంపల్లి డివిజన్‌లో లహరి ఎస్టేట్ వద్ద ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం అతిసార, డెంగ్యూ, మలేరియా, మెదడు వాపు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో తను అనుకున్నది సాధించాలంటే సంపూర్ణ ఆరోగ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడడానికి ఆహారం, తాగునీరు, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత వంటివాటిపై నిత్యం దృష్టి పెట్టాలని వివరించారు. నిత్యం యోగా, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, తృణ ధాన్యాలు, డ్రైఫ్రూట్స్, తాజా ఆకుకూరలు తీసుకోవాలన్నారు. అలాగే పీచు పదార్థాలు కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మారబోయిన సదానందయాదవ్, సభ్యులు జీవీరావు, శివరామకృష్ణ, అమ్మయ్యచౌదరి, ప్రేమ్ సింగ్, వాణిసాంబశివరావు, సుజాత పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్‌సీయూ హెల్త్‌సెంటర్ సీఎంఓ డాక్టర్ రవీంద్రప్రసాద్

వైభవంగా జగన్నాథ రథయాత్ర

శేరిలింగంపల్లి: ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో నల్లగండ్లలో శ్రీ జగన్నాథ రథయాత్రను శనివారం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు హరేరామ..హరేకృష్ణ.. జై జగన్నాథ నినాదాలతో నల్లగండ్ల పరిసరాలు హోరెత్తాయి. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రథయాత్రలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



నల్లగండ్లలో జగన్నాథ రథయాత్ర

ట్రేడ్ లైసెన్స్ ఫీజు రూ.4.31 లక్షలు వసూలు



ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేస్తున్న శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేసేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు. ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేసే ఉద్యోగులకే ట్రేడ్ లైసెన్స్ ఫీజు బాధ్యతలు అప్పగించారు. రెండు రోజులుగా శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని 60 ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా రూ.4.31 లక్షలు వసూలు అయినట్లు డిప్యూటీ కమిషనర్ వి.ప్రశాంతి శనివారం తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేసే సిబ్బందికే వ్యాపారులు ట్రేడ్ ఫీజులు కూడా చెల్లించవచ్చన్నారు. ప్రతి వ్యాపారి జీహెచ్‌ఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్‌ను తీసుకోవడంతో పాటు సకాలంలో ఫీజులు చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

తొలి ఏకాదశి పూజలు

ఆల్విన్‌కాలనీ: తొలి ఏకాదశి సందర్భంగా పాపిరెడ్డినగర్‌లోని వీరాంజనేయాలయంలో ఆదివారం ఉదయం 4.30 గంటలకు శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి, ఆంజనేయ స్వామివారికి, గోదా రంగనాథస్వామి వార్లకు పంచామృతాభిషేకం జరుగుతుంది. అదే విధంగా సాయంత్రం 6 గంటలకు లలితా సహస్ర నామ పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్న హస్తంగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. నియోజకవర్గ పరిధిలోని 48 మంది లబ్ధిదారులకు మంజూరైన 22 లక్షల 10 వేల రూపాయల చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ప్రభాకర్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ప్రమోద్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాయిదమ్మకుంట చెరువు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చెరువుల పునరుద్ధరణతో ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి కాయిదమ్మకుంట చెరువు పనులను శనివారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాయిదమ్మకుంట చెరువు పనుల్లో వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ నళిని, ఏఈ పావని, రెవెన్యూ అధికారులు సర్వేయర్ జగదీష్, జలమండలి మేనేజర్ శ్రీహరి, సీఎస్ఆర్ ఐటి సంస్థ ప్రతినిధులు చైతన్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానమే : ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: రక్తదానం ప్రాణదానమేనని చిన్నారుల జీవితాలలో వెలుగులు నింపడానికి రక్తదాతలు అవ్వాలని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఇంటరేనషనల్ వైశ్య ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పబ్బ మల్లేశం గుప్తా, ముఖ్యఅతిథులుగా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ ప్రస్తుతం బ్లడ్ బ్యాంకుల్లో రక్తం తగ్గిపోతుండడంతో తలసేమియా, ఇతరత్రా వ్యాధిగ్రస్తులకు రక్తం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, రఘునాథ్‌రెడ్డి, నరేందర్ బల్లా, గంప సత్యనారాయణ గుప్త, దారం లక్ష్మయ్య గుప్త, చిన్న సత్యనారాయణ, కట్ట రవి గుప్త, వెంకటేష్ గుప్త, శ్రీనివాస్ గుప్త, మురళి గుప్త, జయకృష్ణ గుప్త, భాస్కర్, కోటేశ్వరరావు, బండారి హాస్పటల్స్, డాక్టర్ సుశ్రుత, రాహుల్, డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

శంషాబాద్ రూరల్: భూమి ఉన్న రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్వేత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా రైతులకు భూ ఆధార్ నంబర్ కేటాయిస్తారని పేర్కొన్నారు. మల్కారం, హమీదుల్లానగర్ క్లస్టర్ల వారీగా ఆయా రైతు వేదికల వద్ద రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి ఆధార్ కార్డుతో పాటు దానికి లింక్ చేసిన మొబైల్ నంబర్ ఇవ్వాలని సూచించారు.

7న పోస్టాఫీస్ సేవలకు అంతరాయం

శంషాబాద్ రూరల్: వినియోగదారులకు మరింత వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు తపాలా శాఖ పోస్టల్ టెక్నాలజీ ఐటీ 2.0ను ప్రవేశపెడుతున్నట్లు సౌత్ ఈస్ట్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ హైమావతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలో జూలై 7న అన్ని పోస్టాఫీసులో ఎలాంటి లావాదేవీలు జరగవని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆమె కోరారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కొమ్ము పరమేష్

చందానగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలంటూ జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కొమ్ము పరమేష్ పేర్కొన్నారు. చందానగర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు 42 హక్కులను రద్దుచేసి వాటి స్థానంలో తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవలన్నారు. జూలై 9 దేశ వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను ప్రతి ఒక్క కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

వ్యక్తి అదృశ్యం

మియాపూర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాని సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ జనప్రియ అపార్ట్‌మెంట్‌లో హన్మంతరావు(57) నివాసముంటున్నాడు. మియాపూర్ కల్వరి టెంపుల్‌లో సమీపంలో టైలరింగ్ షాపు నిర్వహిస్తున్నాడు.ఏప్రిల్ 3వ తేదీ ఉదయం హన్మంతరావు 8 గంటల సమయంలో టైలరింగ్ షాపునకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. రాత్రి 11 గంటలు అయినా హన్మంతరావు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఏప్రిల్ 7వ తేదీ హన్మంతరావు వాట్సప్‌లో విజయవాడలో ఉన్నట్లు కుటుంబ సభ్యులకు మెసేజ్ పంపించాడు. ఈ క్రమంలో జూన్ 4వ తేదీ వరకు కుటుంబ సభ్యులతో వాట్సప్‌లో మాట్లాడుతూ ఉన్నాడు. ఆ తర్వాత నుంచి మాట్లాడకపోవడంతో ఆందోళన చెంది మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



హన్మంతరావు (ఫైల్)

ప్రబలిన జ్వరాలు.. ఆరోగ్య కేంద్రాలు కిటకిట

కూకట్‌పల్లిలో డెంగీ కేసు నమోదు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో జ్వర బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వందల సంఖ్యలో ప్రజలు వస్తుండగా, బస్తీ దవాఖానాలకు సైతం భారీగా రోగులు వస్తున్నారు. జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవడంలో వైద్య ఆరోగ్యశాఖ విఫలమైందని పలువురు విమర్శిస్తున్నారు. నాలా పరీవాహక ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. 10 లక్షలకు పైగా జనాభా కలిగిన కూకట్‌పల్లి నియోజకవర్గంలో 9 చెరువులు, 18 కిలోమీటర్ల మేర నాలాలు ఉన్నాయి. చెరువులలో గుర్రపుడెక్కతో పాటు డ్రైనేజీ నీరు చేరటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. నియోజకవర్గంలో సుమారు 100 కాలనీలు, బస్తీలు నాలాల చుట్టుపక్కల ఉండటంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఈ విషయంపై ప్రజలు, నాయకులు, బస్తీ వెల్ఫేర్ సంఘాల వారు అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని వాపోతున్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలైన కూకట్‌పల్లి, పరికి చెరువు, కేపీహెచ్‌బీ నాలా, ఫాక్స్ సాగర్ నాలాలో వ్యర్థ రసాయనాలు కూడా వదులుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కేపీహెచ్‌బీ మురుగు ఐడియల్ రంగధాముని చెరువులోకి నేరుగా చేరుతుండటంతో సమీపంలో ఉన్న బాలాజీనగర్, వివేక్‌నగర్‌ల వద్ద ముక్కుమూసుకుని పోవాల్సిందే. భరించలేని దుర్వాసన వెలువడుతోంది. ఇక దోమల బెడద తీవ్రమైంది. తాజాగా కూకట్‌పల్లి, వివేక్‌నగర్‌లో రెండు డెంగీ కేసులు వచ్చాయని తెలిసింది. జీహెచ్‌యంసీ శానిటేషన్ అధికారులు తూతూమంత్రంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి.



కూకట్‌పల్లి యూపీహెచ్‌సీ

బాలాజీనగర్‌లో.. డెంగీ

కూకట్‌పల్లి ప్రాంతం బాలాజీనగర్‌లో శుక్రవారం డెంగీ కేసు వచ్చినట్లు తెలిసింది. సిబ్బందిని అక్కడికి పంపిస్తే ఆచూకీ లభించలేదు. జ్వర సర్వేను త్వరలో చేపడతాం. దోమల నివారణపై జీహెచ్‌యంసీ అధికారులకు సూచనలు చేస్తాం.

– మమత, వైద్యాధికారిణి